ఇల్లందకుంటలో సీఎంకు పోస్ట్ కార్డులను పంపిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఇల్లందకుంట, ఫిబ్రవరి 22 : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు వచ్చే అసెంబ్లీ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పోస్ట్ కార్డు ఉద్యమంలో భాగంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డికి 100 పోస్ట్ కార్డులు పంపించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డు, పెన్షన్ ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కో కన్వీనర్ అన్నం ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, మండలాధ్యక్షుడు రావుల రాజబాబు, నాయకులు రవీందర్, రమేశ్ రెడ్డి, రాజీర్, పెద్దికుమార్, సమ్మయ్య, రాజేందర్, వీరారెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, భిక్షపతి, శివ, దిలీప్, గణేశ్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

గంగాధర, ఫిబ్రవరి 22 : ప్రభుత్వ అలసత్వం. అధికారుల నిర్లక్ష్యంతో యూరియా కోసం రైతులు సొసైటీల వద్ద పడిగాపులు పడుతున్నారని, రోజుల తరబడి ఎదురుచూసినా ఒక్క బస్తా యూరియా దొరకడం లేదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సరిపడా ఎరువులు లేకపోవడంతో ఆధార్ కార్డు, పాస్‌బుక్ జిరాక్స్‌లతో ఎరువుల కోసం రైతులు బారులు తీరుతున్నారని, మళ్లీ పాతరోజులు తెచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం స్పందించి రైతులు ఇబ్బంది పడకుండా యూరియాను సరఫరా చేయాలని, లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలల్లో డీఈవో తనిఖీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని నగునూర్, చామనపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు తనిఖీ చేశారు. జన్యసంస్థ సమకూర్చిన విత్తనాలతో ఏర్పాటు చేసిన విటమిన్ గార్డెన్స్ సందర్శించారు. విద్యా బోధనకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

వరి పంటల పరిశీలన

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 22: మొగ్దుంపూర్ గ్రామంలోని వరి పంటలను కూనారం వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ సిద్దిక్ శనివారం పరిశీలించారు. సస్యరక్షణ చర్యలకు సంబంధించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ధాతులోపాల నివారణ చర్యలు, వరిపైరు ఎదగడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కుక్కట్ల తిరుపతి యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ కందుల రమేశ్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

వేడుకగా వీడ్కోలు సమావేశం

చొప్పదండి, ఫిబ్రవరి 22: పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కవి, సామాజికవేత్త సామల కిరణ్ విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అమిరి రత్నాకర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ గుండెటి వెంకట రమణ, డైరెక్టర్స్ పంతగాని అనిల్ కుమార్, వెంగళ హరిప్రసాద్, అధ్యాపకులు స్వప్న, జగన్, కృపాకర్, రాజేశం, మౌనిక, రేఖ, అనూష, సతీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'బలహీన వర్గాల అభ్యర్థులను ఎన్నుకోవాలి'

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 22: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బలహీన వర్గాల అభ్యర్థులను ఎన్నుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన వారు చట్టసభల్లో ఉంటేనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి మంద జ్యోతికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి
- ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడుత శిక్షణ

ఎమ్మెల్సీ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో పమేలా సత్పతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 22 : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం విడుదల చేసిన నియమావళిని ప్రిసైడింగ్ అధికారులు తూచ తప్పకుండా పాటిస్తూ, విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులకు శనివారం జిల్లాపరిషత్ సమావేశమందిరంలో రెండో విడుత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ స్టేషన్ సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందని, కెమెరా పనితీరును పీవోలు పరిశీలించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలపై ప్రతి ప్రిసైడింగ్ అధికారికి పూర్తి అవగాహన ఉండాలని, బ్యాలెట్ బాక్స్ లాకింగ్, సీలింగ్ పకడ్బందీగా చేయాలని ఆదేశించారు.

కొనసాగుతున్న పోలింగ్ స్లిప్పుల పంపిణీ

ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి స్థానాల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్లకు పోలింగ్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతున్నదని, రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులతో శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశమందిరంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి విధిగా పాటించాలన్నారు. పోలింగ్ సమయానికి 48 గంటల ముందు నుంచే ప్రచారం ముగించాలని, ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎలాంటి అనుమతుల కోసమైనా అభ్యర్థులు ఆయా జిల్లాల్లోని ఏఆర్వోలను అభ్యర్థులు కలిసి, దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు సహకరించాలని కోరారు.

బ్యాలెట్ బాక్సులన్నీ కరీంనగర్‌కే తరలించాలి

ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులన్నీ కరీంనగర్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌కే తరలించాలని రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న 15 జిల్లాల్లోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో శనివారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్యాలెట్ బాక్సుల రిసెప్షన్ కేంద్రం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్ల బాక్సులను జిల్లా ఖజానా కార్యాలయంలో ఉంచాలని, లెక్కింపు రోజు ఉదయంలోగా వాటిని లెక్కింపు కేంద్రానికి తరలించాలని సూచించారు. జిల్లాల వారీగా గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయుల వారీగా కౌంటర్లు ఉంటాయని, బ్యాలెట్ బాక్సులు సంబంధిత కౌంటర్లలో అందజేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో సీసీ కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీధర్, ఆర్డీవో కే మహేశ్వర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రంజాన్‌కు మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 22 : మార్చి 2 నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న దృష్ట్యా జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ముస్లింలు సామూహిక నమాజ్ చేసే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మసీదుల్లో టెంట్ల ఏర్పాటు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణకు ఒక నోడల్ అధికారిని నియమించాలని నగర కమిషనర్‌కు సూచించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, వీధిలైట్లు మరమ్మతులు ఉన్నచోట కొత్తవి అమర్చాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే చోట ఉన్న ప్రార్థనా మందిరాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఏసీపీని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. అన్ని మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్య నిర్వహణకు జవాన్లను నియమిస్తామని తెలిపారు. రంజాన్ మాసంలో తాత్కాలిక స్టాళ్లు, దుకాణాలు ఏర్పాటు చేస్తే మున్సిపల్ అనుమతి తీసుకోవాలని కోరారు. తద్వారా అక్కడ సౌకర్యాలు కల్పించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ టీచర్లను అవమానించిన బీసీ కమిషన్ చైర్మన్'

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 22: అంగన్‌వాడీ టీచర్లు కులగణన సర్వే సరిగా చేయకపోవడం వల్లే పూర్తి స్థాయిలో సర్వే జరుగలేదని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అంగన్‌వాడీ టీచర్లను అవమానించేలా ఉన్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టేకుమల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. నగరంలోని యూనియన్ కార్యాలయంలో బద్దం ఎల్లారెడ్డి భవనంలో శనివారం యూనియన్ జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వేలో ప్రజలు పాల్గొనలేదని చెప్పిన నిరంజన్ రెడ్డి.. తర్వాత మాట మార్చి అంగన్‌వాడీ టీచర్లు సర్వే సరిగా చేయలేదనడం అర్థ రహితమన్నారు. బాధ్యత గల హోదా ఉండి రెండురకాలుగా మాట్లాడడం సరికాదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రతి ఇంటికీ వెళ్లినట్లు సర్వే చేశారని స్పష్టం చేశారు. ప్రజలు సర్వేలో పాల్గొనేలా ప్రభుత్వం చూడాలే తప్ప.. సర్వే చేసిన అంగన్‌వాడీ టీచర్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రజిత, నాయకురాళ్లు అరుణ, అనురాధ, శారద పాల్గొన్నారు.

సృజనాత్మకతతోనే పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 22: కథా కవితా రచనకు విద్యార్థి దశ నుంచే శ్రీకారం చుట్టాలని, సృజనాత్మకతతోనే యువతలో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమని సాహితీవేత్తలు డాక్టర్ ఆర్ సీతారాం, గరిపల్లి అశోక్ పేర్కొన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, ఎస్ఆర్ఆర్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఒక రోజు సృజనాత్మక రచన వర్క్‌షాప్‌లో సాహితీవేత్తలు, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ పుస్తకాల ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ పుస్తకాలు జ్ఞానానికి ప్రతిభకు, సృజనాత్మకతకు, ఆలోచనా విస్తృతికి పునాదులు అని పేర్కొన్నారు. ఎందుకు రాయాలి, ఏ విషయం మీద రాయాలి, ఎలా రాయాలి, సమకాలీన సామాజిక విషయాలపై యువత దృక్పథం ఏమిటి అనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ నలిమెల భాస్కర్, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు విభాగం సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, సాహితీ వేత్తలు

మెగా వైద్య శిబిరానికి స్పందన



రక్తదానం చేసిన దాతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

విద్యానగర్, ఫిబ్రవరి 22: టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచిలో శనివారం మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సూర రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజల నుంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 145 మందికి డెంటల్, 175 మందికి కంటి, 152 మందికి న్యూరో-ఫిజికల్ పరీక్షలు నిర్వహించారు. మెగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో 66 మంది పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 526 మంది పరీక్షలు చేయించుకోగా, అవసరమైనవారికి మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో వీరస్వామి, ఆదర్శ్, చంద్రశేఖర్, వెంకటేశ్ వర్మ, మహేందర్, శ్రీకాంత్, జి. రాజు, సృజన్, డి.రమేశ్, పాల్గొన్నారు. తాటికొండ అనిల్ కుమార్ శ్రీధన్వి మల్టీ స్పెషాలిటీ న్యూరో హాస్పిటల్, శ్రీ వైష్ణవి ఎస్సార్ మల్టీస్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్, వాసన్ ఐ కేర్, సివిల్ హాస్పిటల్ వైద్యులు సేవలందించారు.

ఘనంగా ప్రపంచ ఆలోచనా దినోత్సవం

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 22 : భారత్ స్కౌట్స్ గైడ్స్ ఫౌండర్స్ లార్డ్ బడెన్ పావెల్ లేడీ బుడెన్పావెల్ జన్మదినం సందర్భంగా ప్రపంచ ఆలోచనా దినోత్సవాన్ని రేకుర్తిలోని విజన్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు సిరిపురం ప్రసాద్, సందవేని వెంకటేశం, తొర్రికొండ మల్లయ్య మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ, క్రమ శిక్షణతో స్కౌట్స్ సిలబస్ నేర్చుకొని చదువులో రాణిస్తూ, లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ గంగారపు మల్లేశం, ప్రిన్సిపాల్ లింగాల రాజిరెడ్డి, వెడ్ కెప్టెన్ గంగారపు సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సదస్సు విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 22: హైదరాబాద్‌లో ఈ నెల 24న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ, జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ పిలుపు నిచ్చారు. నగరంలోని కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ, ఎస్సీ 53 ఉపకులాలకు అన్యాయం జరుగకుండా జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కొంతమంది స్వార్థపరుల మాటలతో సీఎం రేవంత్‌రెడ్డి, ఎస్సీ రిజర్వేషన్ కమిషన్ షమీం అక్తర్ వర్గీకరణ అమలు చేస్తూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై చర్చించేందుకు ఈ నెల 24న నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయిసదస్సుకు ఉమ్మడి జిల్లా నుంచి మాదిగలు, ఉపకులాలకు చెందిన వారు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్, అంజన్న పాల్గొన్నారు.

'బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలి'

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 22: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ డబ్బులు పంచుతున్నదని ఆరోపించి, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థి ఓడిపోతాడనే భయంతోనే ఇతర పార్టీల మీద ఆయన దుష్ప్రచారం చేస్తున్నాడని విమర్శించారు. ఎన్నికలు జరిగే సమయంలో పార్టీల మీద నిందలు వేయడం బండి సంజయ్‌కుమార్‌కు అలవాటుగా మారిందన్నారు. నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతో అసత్యప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలని కుట్రలు చేస్తున్నాడని మండిపడ్డారు. పట్టభద్రులకు బండి సంజయ్ కుమార్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 22: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో కంటి వెలుగు పథకం ద్వారా డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నేత్ర పరీక్షలు కొనసాగాయి. ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. కంటి చూపు సమస్యలున్న పిల్లలకు అద్దాలను ఉచితంగా ఇవ్వనున్నారు. శనివారం వరకు సుమారు 450 మందికి కంటి పరీక్షలు చేశామని హుజూరాబాద్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ చందు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మాలతి, డాక్టర్ మొగిలి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, సీహెచ్‌వో శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాక.. మనస్తాపానికి గురై..

- పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట, ఫిబ్రవరి 22: తాను చదివిన చదువుకు ఉద్యోగం రాక.. మనస్తాపానికి గురైన యువకుడు(23)పురుగుల మందుతాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన వేల్పుల సుధాకర్ కొడుకు అజయ్‌కుమార్ డిగ్రీ పూర్తి చేశాడు. గత కొద్ది కాలంగా ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేశాడు. ఎలాంటి ఉద్యోగావకాశాలు లభించలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం జమ్మికుంటకు వచ్చాడు. పట్టణ శివారు(మడిపల్లి రోడ్డులో)పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు గమనించారు. హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అజయ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

'నమ్మకద్రోహం చేసిన కాంగ్రెస్'

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 22: కాంగ్రెస్ పార్టీ నమ్మకద్రోహం చేసిందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి నామినేషన్ ఉపసంహరించుకున్న మాజీ డీఎస్పీ (వీఆర్ఎస్) గంగాధర్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్ భవనంలో పలు కుల సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పట్టభద్రుల కోసం రూపొందించిన మ్యానిఫెస్టోను అమలు చేస్తామన్న హామీ మేరకు ఈ నెల 12న కాంగ్రెస్ నాయకుడు హన్మంతరావు సమక్షంలో ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు. పది రోజుల వరకు వారి నుంచి పిలుపు వస్తుందని ఎదురుచూసినా ఎలాంటి సమాచారం లేక పోవడంతో కాంగ్రెస్ పార్టీ నమ్మద్రోహం చేసినట్లు గ్రహించానన్నారు. సంచార జాతి వర్గానికి చెందిన తనను రాజకీయంగా ఎదుగకుండా కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేసిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. తన అభిమానులతో కలిసి ఎవరికి మద్దతు ఇవ్వాలో నిర్ణయం తీసుకుంటానన్నారు. సమావేశంలో కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

రామడుగు, ఫిబ్రవరి 22 : పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సమగ్రశిక్షా అభియాన్ జిల్లా సెక్టోరియల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించిన అశోక్‌రెడ్డి మధ్యాహ్న భోజన సమయంలో పదో తరగతి విద్యార్థులతో పరస్పర సమీక్ష నిర్వహించారు. టీ సాట్ చానల్ ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాల ద్వారా విద్యార్థులు నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరీక్షలపై విద్యార్థులు భయపడాల్సిన పనిలేదని, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇంకా 25 రోజుల సమయం ఉందన్నారు. ప్రతి రోజూ ఉపాధ్యాయులు చేసే వేకప్ కాల్స్ ద్వారా ఉదయమే నిద్రలేచి చదువుకోవాలని సూచించారు. టీ సాట్ కార్యక్రమాల ద్వారా ప్రతి సబ్జెక్టులో మోడల్ ప్రశ్నలను గమనించి, పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని శైలజ, ఉపాధ్యాయులు మంజుల, గంగ, సత్యనారాయణరెడ్డి, హన్మాండ్లు, చంద్రశేఖర్, సమ్మయ్య, మంజుశ్రీ, జల పతిరెడ్డి, అస్గర్‌అలీ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న 'చాణక్యోత్సవం'

నృత్యం చేస్తున్న విద్యార్థులు

మానకొండూర్, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని చాణక్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. చాణక్యోత్సవం 2025 పేరుతో స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 30వ వార్షికోత్సవాలు కనుల పండువగా సాగాయి. విద్యార్థుల నృత్యాలు ఈ సందర్భంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ అడెపు రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో ఆస్తి రిజిస్ట్రేషన్: ఏడుగురిపై కేసు

జమ్మికుంట, ఫిబ్రవరి 22: ఫోర్జరీ సంతకాలతో ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జమ్మికుంటకు చెందిన బాసాని బాలశౌర్యరెడ్డి కుటుంబం హైదరాబాద్‌లో సెటిలైంది. వారికి సంబంధించిన ఆరు ఎకరాల వ్యవసాయ భూమి పట్టణంలో ఉంది. అయితే, బాలశౌర్యరెడ్డి 2024లో మృతి చెందాడు. ఆయనకు సంబంధించిన భూమికి సవతి తల్లి బాసాని మేరీ, ఆమె కూతుళ్లు- అల్లుళ్లు సుమలత, పుల్లారావు, సునీల, అరుణ, సుశీల, ఏరువా, మర్రిరెడ్డి కలిసి ఫోర్జరీ సంతకాలతో నకిలీ వీలునామా పత్రాలు సృష్టించారు. ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మృతుడి కొడుకు బాసాని విక్రమ్‌ప్రితం రెడ్డి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫోర్జరీ సంతకాలు, నకిలీ వీలునామాతో భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రంజాన్‌కు సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌కు వినతి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 22: రంజాన్ మాసం సందర్భంగా హుజూరాబాద్ డివిజన్‌లోని మసీదులు, ఈద్గాలు, ఖబ్రస్తాన్‌లలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించాలని హుజూరాబాద్ డివిజన్ మసీద్, ఈద్గా, ఖబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్